

నువ్వా.. నేనా?
కాంగ్రెస్ పార్టీలో వర్గపోరు మరోసారి బయటపడింది. కీలక నేతల సమక్షంలోనే నువ్వా.. నేనా? అనేలా బలప్రదర్శన జరిగింది.
- 8లో ▸



మూడు గంటల ప్రభుత్వమా..
వ్యవసాయానికి 3గంటల విద్యుత్ చాలన్న కాంగ్రెస్ కావాలా.. 3 పంటలు పండించేందుకు విద్యుత్ ఇచ్చే బీఆర్ఎస్ కావాలో తేల్చుకోవాలని మంత్రి ఎర్రబెల్లి అన్నారు. - 8లో ▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం
33^0/24^0
జిల్లాలో ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం ఒకటి రెండు ప్రాంతాల్లో చిరు జల్లులు కురిసే అవకాశం ఉంది. సాయంత్రం చల్లగా ఉంటుంది.

న్యూస్‌రీల్

రక్తదానానికి ముందుకు రావాలి

కలెక్టర్ సిక్తా పట్నాయక్



హన్మకొండ అర్బన్: తలసేమియా వ్యాధిగ్రస్తులకు రక్తం చాలా అవసరమని, ప్రతి ఒక్కరూ రక్తదానానికి ముందుకు రావాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. మంగళవారం డీఆర్డీఓ ఆధ్వర్యంలో రెడ్ క్రాస్ సంస్థ సౌజన్యంతో కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని కలెక్టర్ సిక్తా పట్నాయక్ ప్రారంభించారు. ఈసందర్భంగా రక్తదాతలను, శిబిరాన్ని ఏర్పాటు చేసిన సిబ్బందిని కలెక్టర్ అభినందించారు. ఈశిబిరంలో అదనపు కలెక్టర్ మహేందర్‌జీ, డీఆర్డీఓ పీడీ ఎ.శ్రీనివాస్‌కుమార్, అధికారులు, సిబ్బంది పాల్గొని మొత్తం 155 యూనిట్ల రక్తం దానం చేసినట్లు రెడ్‌క్రాస్ నిర్వాహకులు తెలిపారు. డీఆర్డీఓ పీడీ ఆకవరం శ్రీనివాస్ 54వసారి రక్తదానం చేశారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ చైర్మన్ పి.విజయ్‌చందర్‌రెడ్డి, ఈ.వి శ్రీనివాస్‌రావు, డీఎంహెచ్ఓ సాంబశివరావు, టీఎన్జీఓస్ జిల్లా అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డి, పుల్లూరు వేణుగోపాల్ పాల్గొన్నారు.

34 మంది డీబార్

కేయూ క్యాంపస్: కేయూ పరిధిలో మంగళవారం నిర్వహించిన దూరవిద్య డిగ్రీ బీఏ, బీకాం, బీబీఏ, బీఎస్సీ ఫైనల్ ఇయర్ పరీక్షల్లో మూడు పరీక్షా కేంద్రాల్లో కాపీయింగ్ చేస్తూ.. 34 మంది విద్యార్థులు డీబార్ అయినట్లు పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య పి.మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎ.నరేందర్ తెలిపారు. జనగామ ఏబీవీ డిగ్రీ కళాశాలలో 28 మంది, వరంగల్ ఎల్‌బీ కళాశాలలో ఒకరు, నిర్మల్ ప్రభుత్వ కళాశాలలో ఒకరు, నల్లగొండలోని ఎన్జీ కళాశాలలో నలుగురు డీబార్ అయినట్లు తెలిపారు.

'ఓపెన్'లో ప్రవేశాలకు గడువు నెలాఖరు

విద్యారణ్యపురి: ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఓపెన్ స్కూల్ టెన్త్, ఇంటర్‌లో ప్రవేశాలకు ఈనెల 31 వరకు చివరి గడువు అని హనుమకొండ జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ ఎండీ అబ్దుల్‌హై, ఉమ్మడి జిల్లా ఓపెన్ స్కూల్ కో–ఆర్డినేటర్ శంకర్‌రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రెగ్యులర్ కోర్సులకు సమానంగా ప్రాధాన్యం ఉండి ప్రవేశాలు పొందే విద్యార్థులు ఉమ్మడి జిల్లాలోని అధ్యయన కేంద్రాల కో–ఆర్డినేటర్లను సంప్రదించి ప్రవేశాలు పొందాలని సూచించారు. సమాచారానికి 80084 03631లో సంప్రదించాలని కోరారు.

టీపీసీసీ మీడియా ప్రతినిధుల నియామకం

వరంగల్: వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ మీడియా అధికార ప్రతినిధులుగా డాక్టర్ ఎండీ.రియాజ్, దామోద్ అవేలీలను నియమిస్తూ పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ బి.మహేశ్‌కుమార్ గౌడ్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని సమస్యలపై మీడియా సమావేశాలు నిర్వహించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ప్రయాణికుల సమస్యలు పరిష్కరిస్తాం

హన్మకొండ: ప్రయాణికులు చెప్పిన సమస్యలు, సలహాలు, సూచనలు పరిశీలించి పరిష్కరిస్తామని ఆర్టీసీ వరంగల్–1 డిపో మేనేజర్ వి.వెంకటేశం అన్నారు. మంగళవారం హనుమకొండలోని ఆర్టీసీ వరంగల్–1 డిపో నుంచి డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ప్రయాణికులు సమస్యల్ని డీఎంకు వివరించారు. పలు రూట్లలో అదనంగా బస్సులు నడపాలని, బస్సుల వేళలు మార్చాలని కోరారు. హనుమకొండ నుంచి తరిగొప్పుల, నర్మెట, వెల్దండ, కొడవటూరు, బచ్చన్నపేట, ఆలేరు మీదుగా యాదగిరి గుట్టకు బస్సు నడపాలని ఈప్రాంత ప్రయాణికులు కోరారు. కార్యాలయ సూపరింటెండెంట్ ఎం.సరోత్తమ్‌రెడ్డి, అసిస్టెంట్ మేనేజర్ సీహెచ్.సంతోశ్‌కుమార్ పాల్గొన్నారు.

పలు రైళ్లకు అంతరాయం

కాజీపేట రూరల్: కాజీపేట సబ్ డివిజన్ పరిధిలోని సిర్‌పూర్ కాగజ్‌నగర్ వద్ద మంగళవారం చేపట్టిన ఇంటర్‌లాకింగ్ బ్లాక్‌తో పలు రైళ్లకు అంతరాయం ఏర్పడింది. దీంతో సికింద్రాబాద్–సిర్‌పూర్‌కాగజ్‌నగర్–సికింద్రాబాద్ మధ్య ప్రయాణించే ఎక్స్‌ప్రెస్‌ను కాజీపేట వరకు నడిపించారు. సికింద్రాబాద్–సిర్‌పూర్ కాగజ్‌నగర్ వెళ్లే ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్, సికింద్రాబాద్–బల్లార్షా వెళ్లే భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్‌ను బెల్లంపల్లి వరకు అప్‌అండ్‌డౌన్ రూట్‌లో నడిపించారు. వివిధ ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు ఇబ్బంది పడాల్సి వచ్చింది. సికింద్రాబాద్–సిర్‌పూర్ కాగజ్‌నగర్ వెళ్లే ఇంటర్‌సిటీ, సికింద్రాబాద్–బల్లార్షా వెళ్లే భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్‌లను బెల్లంపల్లి వరకు అప్‌అండ్ డౌన్ రూట్‌లో నడిపిస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు.

ఏళ్లుగా ఎదురుచూపులు

- పింఛన్ దర్యాప్తులో బిల్ కలెక్టర్ల నిర్లక్ష్యం
- ఆందోళనలో అర్హులు

వరంగల్ అర్బన్: కరీమాబాద్ కామునిపెంటకు చెందిన రాజయ్య ఆసరా పింఛన్ కోసం రెండేళ్ల క్రితం దరఖాస్తు చేసుకున్నాడు. ఇంతవరకు బిల్ కలెక్టర్ విచారణకు రాలేదు. సాకరాశికుంటకు చెందిన సుబ్బారావు వృద్ధాప్య పింఛన్ కోసం నాలుగేళ్లుగా ఎదురుచూస్తున్నాడు. ఎస్ఆర్ఆర్ తోటకు చెందిన సుజాత భర్తను కోల్పోయి రెండేళ్లవుతోంది. పింఛన్ కోసం దరఖాస్తు చేస్తే విచారణ పూర్తి చేయగా.. అప్రూవ్ అని వైబ్‌సైట్‌లో చూపిస్తోంది. కానీ.. ఇంత వరకు పింఛన్ సొమ్ము రాలేదు. ఇలా ఒకరిద్దరు కాదు.. నగరంలో వేలాదిమంది పేదలు పింఛన్ల కోసం ఎదురు చూస్తున్నారు. అర్హులు దరఖాస్తు చేసుకుంటే సకాలంలో పింఛన్ ఇస్తామని ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు, అధికారులు పదే పదే చెబుతున్నా.. ఏళ్లు గడిచినా.. పింఛన్ రావట్లేదని నిరుపేదలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వరంగల్ నగరవ్యాప్తంగా 66 డివిజన్ల నుంచి 79,480 మంది వివిధ రకాల పింఛన్ల లబ్ధిదారులున్నారు.

5 వేలకు పైగా దరఖాస్తులు

నగరంలో పింఛన్ కోసం 5 వేలకుపైగా పింఛన్ దరఖాస్తుదారులు పడిగాపులు కాస్తున్నారు. పింఛన్ ఎప్పుడిస్తారోనని ఎదురుచూస్తున్నారు. ప్రస్తుతం బల్దియా వైబ్‌సైట్‌లో 2,500 మందికి దర్యాప్తు పూర్తి చేసి అర్హులుగా తేల్చినట్లు రికార్డుల్లో పేర్కొన్నారు. మరో 2,500 దరఖాస్తులు బిల్ కలెక్టర్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ల లాగిన్‌లో పెండింగ్‌లో ఉన్నాయి. బిల్ కలెక్టర్లు విచారణ సమయం దొరకడం లేదని పెండింగ్‌లో పెడుతున్నారు. వివిధ రకాల పనుల ఒత్తిడి కారణంతో దర్యాప్తు చేయలేకపోతున్నామని పేర్కొంటున్నారు. అన్ని అర్హతలున్నా పింఛన్ ఎందుకివ్వట్లేదని నిరుపేదలు ప్రశ్నిస్తున్నారు. పింఛన్ కోసం ఆశగా ఎదురు చూస్తున్నారు.



నగరంలో పింఛన్ లబ్ధిదారులు ఇలా..

మొత్తం పింఛన్లు	: 79,480
వికలాంగులు	: 9,305
బీడీ కార్మికులు	: 6,032
ఒంటరి మహిళలు	: 2,410
వృద్ధులు	: 26,050
గీత కార్మికులు	: 688
చేనేత కార్మికులు	: 2,139
వితంతువులు	: 32,856

ఐదేళ్లలో ఒక్కసారే..

రాష్ట్ర ప్రభుత్వం 2018 సెప్టెంబర్ నుంచి కొత్త పింఛన్ల మంజూరును నిలిపేసింది. సుమారు మూడున్నరేళ్ల తర్వాత హుజూరాబాద్ ఉప ఎన్నికల ముందు గతేడాది ఆగస్టులో నగరానికి 14 వేలకు పైగా కొత్త పింఛన్లు మంజూరయ్యాయి. ఏడాదిగా కొత్త పింఛన్ల మంజూరు నిలిచింది. ఎన్నికలు సమీపిస్తున్నందున ఇప్పుడైనా పింఛన్లు మంజూరు చేయాలని పేదలు డిమాండ్ చేస్తున్నారు. పింఛన్ కోసం బల్దియా ప్రధాన కార్యాలయం, సర్కిల్ కార్యాలయాలు, ప్రజాప్రతినిధులు చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఎన్నికల వేళ ప్రభుత్వం తమకు పింఛన్లు మంజూరు చేయాలని కోరుతున్నారు.

రోగులకు మెరుగైన వైద్యమందించండి

- అదనంగా ఓపీ కౌంటర్లు ఏర్పాటు చేయండి
- కలెక్టర్ ప్రావీణ్య
- ఎంజీఎం ఆకస్మిక సందర్శన

ఎంజీఎం: ఎంజీఎం ఆస్పత్రికి వచ్చే పేద రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని కలెక్టర్ ప్రావీణ్య ఎంజీఎం అధికారులను ఆదేశించారు. మంగళవారం మున్సిపల్ కమిషనర్ రిజ్వాన్ బాషాతో కలిసి ఎంజీఎం ఆస్పత్రిని ఆమె ఆకస్మికంగా సందర్శించారు. కలెక్టర్ ముందుగా ఆస్పత్రిలోని ఔట్ పేషెంట్ విభాగంలో రోగులు పొందే వైద్యసేవలను పరిశీలించారు. ఓపీ విభాగం వద్ద వందల సంఖ్యలో క్యూలో ఉన్న రోగులను చూసి.. రోగుల సంఖ్యకు అనుగుణంగా కౌంటర్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే రోగులకు తెలిసేలా.. ఎంట్రీ, ఎగ్జిట్ సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. రక్త పరీక్షల నమూనాలు ఓపీ ప్రాంతంలోనే సేకరించేలా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.

హాస్టల్ పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి

ఎంజీఎం ప్రాంగణంలో నర్సింగ్ విద్యార్థులు ఉండే హాస్టల్‌ను కలెక్టర్ ప్రావీణ్య సందర్శించారు. ఈసందర్భంగా ఆమె విద్యార్థులతో మాట్లాడుతూ.. హాస్టల్ ప్రాంతాల్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. పేషెంట్ కేర్, సెక్యూరిటీ సిబ్బంది తప్పనిసరిగా యూనిఫామ్ వేసుకునేలా చూడాలని, పదిరోజుల్లో కొత్త యూనిఫామ్‌తో విధులకు హాజరు కావాలని ఆదేశించారు. పార్కింగ్ సమస్యను అధిగమించడానికి తగు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పార్కింగ్‌పై మ్యాప్ ఇవ్వాలని మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంజీఎం పరిపాలనాధికారులు, జీడబ్ల్యూఎంసీ చీఫ్ ఇంజనీర్ కృష్ణారావు, టీఎస్ఎంఎస్ఐడీసీ డిప్యూటీ ఇంజనీర్ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



ఫార్మసీ విభాగాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య

భద్రకాళీ హుండీ ఆదాయం రూ.58 లక్షలు

హన్మకొండ కల్చరల్: భద్రకాళి దేవాలయంలో మంగళవారం హుండీని లెక్కించారు. ఈఓ శేషభారతి ఆధ్వర్యంలో సిబ్బందితో పాటు శ్రీలక్ష్మీ వేంకటేశ్వర సేవా సమితి భక్తులు పాల్గొన్నారు. రూ.58,01,647 ఆదాయం వచ్చిందని, 620 యూఎస్ డాలర్లు, 70 ఆస్ట్రేలియన్ డాలర్లు, 15 కెనడా డాలర్లు, 15 ఇంగ్లండ్ పౌండ్స్, 10 షిల్లింగ్స్, 50 ఫిలిప్పిన్స్ పిసోలు లభించినట్లు, వీటిని బ్యాంకులో జమ చేసినట్లు ఈఓ తెలిపారు.

కళా వైభవాన్ని ప్రపంచానికి చాటుతాం

- మెట్ల బావిని పునరుద్ధరిస్తాం
- కలెక్టర్, మేయర్, కమిషనర్

సాక్షి ఎఫెక్ట్

ఖిలా వరంగల్: 'ఆధునికీకరిస్తే అదరహో' శీర్షికన మంగళవారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. కలెక్టర్ ప్రావీణ్య, మేయర్ గుండు సుధారాణి, బల్దియా కమిషనర్ రిజ్వాన్ బాషా హైదరాబాద్ సాంకేతిక బృంద సభ్యులతో కలిసి శివనగర్‌లోని మెట్ల బావిని పరిశీలించారు. సాంకేతిక, సంప్రదాయకమైన పద్ధతిలో చేపట్టాల్సిన నవీకరణ చర్యలపై చర్చించారు. అనంతరం కలెక్టర్ ప్రావీణ్య, మేయర్ గుండు సుధారాణి మాట్లాడుతూ.. మెట్లబావిని పునరుద్ధరించి కళావైభవాన్ని ప్రపంచానికి చాటుతామన్నారు. పర్యాటకులను ఆకర్షించేలా అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. సాంకేతిక బృందం సూచనలు పరిగణనలోకి తీసుకుని హైదరాబాద్ బన్సీలాల్‌పేట మెట్ల బావి తరహాలో పునరుద్ధరణకు వెంటనే ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను వారు ఆదేశించారు. ముందుగా మెట్ల బావిలో డీ–సిల్టింగ్, అభివృద్ధి ప్రక్రియను చేపట్టాలని అధికారులకు సూచించారు. హైదరాబాద్ సాంకేతిక బృందం సూచించిన తరహాలో ప్రణాళికలు సిద్ధం చేసి త్వరలోనే ప్రభుత్వానికి నివేదిక పంపనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ దిడ్డి కుమారస్వామి, మాజీ కార్పొరేటర్ దిడ్డి నాగరాజు, టెక్నికల్ టీం సభ్యులు కల్పన రమేశ్, వెంకటేశ్, వాత్సల్య, ఈ.ఈ.శ్రీనివాస్, డీఈ రవికిరణ్, తహసీల్దార్ నాగేశ్వర్‌రావు, ఏఈ హబీబ్, బిల్లా రాజు తదితరులు పాల్గొన్నారు.



మెట్ల బావిని పరిశీలిస్తున్న సాంకేతిక బృందంతో అధికారులు, ప్రజాప్రతినిధులు

నిబంధనలు పాటిస్తేనే ప్రమాదాల నివారణ

- చీఫ్‌విప్ వినయ్‌భాస్కర్
- ట్రాఫిక్ నియమాలపై అవగాహన

హన్మకొండ అర్బన్: చిరు వ్యాపారులు, ఆటోడ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తేనే ప్రమాదాల్ని నివారించవచ్చని ప్రభుత్వ చీఫ్ విప్ వినయ్‌భాస్కర్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో చిరువ్యాపారులు, ఆటో డ్రైవర్లు, వర్తక సంఘం ప్రతినిధులతో రోడ్డు, ట్రాఫిక్ నియమ నిబంధనలపై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో చీఫ్ విప్ వినయ్‌భాస్కర్ పాల్గొని మాట్లాడారు. వెండర్స్ జోన్స్‌లోనే వ్యాపారాలు కొనసాగిస్తూ.. ట్రాఫిక్‌కు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సహకరించాలన్నారు. కలెక్టర్ సిక్తా పట్నాయక్ మాట్లాడుతూ.. ఇలాంటి సదస్సులు తరుచూ నిర్వహించి క్షేత్రస్థాయి సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి చొరవ తీసుకుంటామన్నారు. వరంగల్ పోలీస్ కమిషనర్ ఏవీ.రంగనాథ్ మాట్లాడుతూ.. వాహనదారులకు ఫైన్‌లు వేసి వారిని ఇబ్బంది పెట్టడం పోలీసుల అభిమతం కాదన్నారు. వారికి ఫైన్ వేయడం కంటే ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కల్పించాలని ట్రాఫిక్ పోలీసులకు సూచించారు. ప్రాంతాల వారీగా కో–ఆర్డినేషన్ కమిటీలు ఏర్పాటు చేసి సమస్యలను గుర్తించాలన్నారు. కార్యక్రమంలో జీడబ్ల్యూఎంసీ కమిషనర్ రిజ్వాన్ బాషా, 'కుడా' చైర్మన్ సుందర్ రాజ్‌యాదవ్, డీసీసీ బారీ, మైనార్టీ కమిషన్ సభ్యుడు దర్శన్‌సింగ్, చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు, ఆటోడ్రైవర్ యూనియన్, చిరువ్యాపారుల సంఘం ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చీఫ్ విప్ వినయ్‌భాస్కర్

మంత్రి ఇంటి ముట్టడికి యత్నం

- ఆశ కార్యకర్తలను అడ్డుకున్న పోలీసులు
- రోడ్డుపై నిరసన, నాయకుల అరెస్ట్

హన్మకొండ: సమస్యలు పరిష్కరించాలని ఆశ వర్కర్లు మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఇంటి ముట్టడికి యత్నించగా.. పోలీసులు అడ్డుకున్నారు. మంగళవారం హనుమకొండ పబ్లిక్ గార్డెన్‌లో సమావేశమై అక్కడి నుంచి రాంనగర్‌లోని మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఇంటి ముట్టడికి ర్యాలీగా బయల్దేరారు. ముందస్తు సమాచారంతో పోలీసులు రాంనగర్‌లోని మంత్రి స్వగృహం, క్యాంపు కార్యాలయం వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. మంత్రి ఇంటికి వెళ్లే దారిని బారికేడ్లు అడ్డుపెట్టి మూసేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో ఆర్అండ్‌బీ అతిథి గృహంలోని క్యాంపు కార్యాలయాన్ని ముట్టడిస్తున్నట్లు ప్రచారం జరిగింది. అయితే సీఐటీయూ నాయకులు రూట్ మార్చారు. పోలీసులు ముందుగా జాగ్రత్తలు తీసుకోవడంతో మంత్రి ఇంటి వరకు చేరుకోలేకపోయారు. ర్యాలీ మంత్రి ఇంటి సమీపంలోకి చేరుకోగానే.. పోలీసులు బారికేడ్లు పెట్టి అడ్డుకున్నారు. అయినప్పటికీ పోలీసులను తోసుకుంటూ ముందుకెళ్లేందుకు యత్నించగా.. పోలీసులు ప్రతిఘటించారు. దీంతో ఇరువర్గాల మధ్య తోపులాట జరిగింది. ఆశ కార్యకర్తలు రోడ్డుపైనే బైఠాయించి నిరసన తెలిపారు. తమ డిమాండ్లు అమలు చేయాలని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినదించారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాగుల రమేశ్, ఇతర నాయకులను అరెస్ట్ చేసి సుబేదారి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. తర్వాత ఆశ కార్యకర్తలను వెళ్లిపోవాలని పోలీసులు హెచ్చరించినా.. నిరసన కొనసాగించారు. కలెక్టరేట్‌లో ఉన్న చీఫ్‌విప్ వినయ్‌తో మాట్లాడిస్తామని పోలీసులు చెప్పినా.. వినిపించుకోకుండా అరెస్ట్ చేసిన నాయకులను వదిలేస్తేనే తాము విరమించుకుంటామని ఆశ కార్యకర్తలు భీష్మించుకుని కూర్చున్నారు. అరెస్ట్ చేసిన వారిని సైతం కలెక్టరేట్‌కు తీసుకొస్తామని చెప్పడంతో నిరసన విరమించుకున్నారు. దీంతో పోలీసులు ఆశవర్కర్ల ప్రతినిధుల బృందాన్ని, సీఐటీయూ నాయకులను రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్ భాస్కర్ వద్దకు తీసుకెళ్లి మాట్లాడించారు. సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చూస్తానని వినయ్ భాస్కర్ వారికి హామీ ఇచ్చారు.

కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాగుల రమేశ్, జిల్లా ఉపాధ్యక్షుడు బొట్ల చక్రపాణి, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు వేల్పుల సారంగపాణి, నాయకులు ఎస్.రజిత, కన్నూరి కల్పన, కె.పద్మ, గొర్రె పుతిలి, ఎం.జ్యోతి, ఎల్.సంధ్య, సీహెచ్ రాజేశ్వరి, సీహెచ్ శ్రీవాణి, ఎస్.రమ, యాకూబీ, బొక్క సునంద, రజినీ, ఎస్.పద్మ, మాచర్ల రజిత, సుమలత తదితరులు పాల్గొన్నారు.



ముట్టడికి ర్యాలీగా వెళ్తున్న ఆశకార్యకర్తలు



ఆశవర్కర్లను అడ్డుకుంటున్న పోలీసులు

తూర్పులో 'అంతర్గత అసమ్మతి'!

టికెట్ ఖరారైనా నరేందర్‌తో సాగేందుకు ముఖ్యుల అనాసక్తి

- అధిష్టానం నుంచి ఆదేశాలు వస్తే చూద్దామని దాటవేత
- గెలుపు కోసం కృషి చేయాలని కార్పొరేటర్లతో నరేందర్ భేటీ



సాక్షి, వరంగల్: వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని బీఆర్ఎస్ పార్టీలో లోలోన అసమ్మతి నివురుగప్పిన నిప్పులా మారింది. ఇక్కడ ఎమ్మెల్యే టికెట్ కోసం తీవ్ర ప్రయత్నాలు చేసిన ముఖ్య నేతలు నన్నపునేని నరేందర్‌కు సహకరించేందుకు సిద్ధంగా లేకపోవడం చూస్తుంటే గులాబీ పార్టీ గెలుపు ప్రశ్నార్థకమేనన్న భావన పార్టీ శ్రేణుల్లో వ్యక్తమవుతోంది. ఇన్నాళ్లు తమను పట్టించుకోకుండా ఒంటెద్దు పోకడలతో ఆగమాగం చేయడం.. అదే సమయంలో వివిధ సందర్భాల్లో ప్రాధాన్యం ఇవ్వకుండా రాజకీయం చేశారని భావిస్తున్న ముఖ్య నేతలు ఎన్నికల ముంగిట ఏమాత్రం తగ్గడం లేదన్న వాదన వినిపిస్తోంది. ఇటీవల ఎమ్మెల్యే నరేందర్ తనకు అసెంబ్లీ టికెట్ ఖరారైన నేపథ్యంలో ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్యతోపాటు మేయర్ గుండు సుధారాణిని కలిసేందుకు వెళ్లిన సమయంలో ఆశించినంత స్పందన రాలేదన్న ప్రచారం సాగుతోంది. ఓ నేత.. మంత్రి కేటీఆర్‌తోపాటు అధిష్టానం మాట్లాడాక చూద్దామని అంటే.. మరో నేత ఆరోగ్యం బాగా లే దని, కలిసేందుకు కుదరదని చెప్పినట్లు తెలుస్తోంది. అధిష్టానం నుంచి స్పష్టమైన ఆదేశాలు వస్తే తప్ప నరేందర్‌కు గడ్డుకాలమేనన్న టాక్ వినిపిస్తోంది.

కార్పొరేటర్లపై ఒత్తిడంట..

కొద్ది నెలల క్రితం మంత్రి కేటీఆర్ పర్యటనకు వచ్చిన సమయంలో కొంతమంది కార్పొరేటర్లు తమ ఫొటోలు, పేర్లతో పోస్టర్లు, స్వాగత తోరణాలు కడతామంటే అందుకు ఎమ్మెల్యే ససేమిరా అనడం కూడా వారిలో తీవ్ర అసంతృప్తికి దారి తీసింది. అలాగే నియోజకవర్గంలోని వివి ధ డివిజన్లలో జరిగిన అభివృద్ధి పనుల్లో కమీషన్ రాకుండా ఎమ్మెల్యే అడ్డుపడ్డారని అనుచరుల వద్ద వాపోతున్న పరిస్థితి ఉంది. ఈనేపథ్యంలో టికెట్ ఖరారైన తరువాత ఎమ్మెల్యే నరేందర్ ఇటీవల కార్పొరేటర్లందరినీ రప్పించుకుని ఓసిటీలో గల ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలోని తన గదిలో విడివిడిగా మాట్లాడినట్టు తెలిసింది. ఓవైపు పార్టీ కోసం పనిచేయాలంటూనే.. తనను గెలిపించేందుకు కృషి చేయాలని కోరారు. అదే సమయంలో పక్కచూపులు చూస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారన్న మాటలు కూడా కార్పొరేటర్లను ఆందోళనలో పడేశాయన్న చర్చ జోరుగా సాగుతోంది. ఈనేపథ్యంలోనే బీఆర్ఎస్ నుంచి కొద్దిరోజుల క్రితం కాంగ్రెస్ పార్టీలో చేరిన ఓ మాజీ కార్పొరేటర్‌ను డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఇరికించడం కూడా వ్యూహంలో భాగమేనన్న చర్చ జరుగుతోంది. అందుకే కార్పొరేటర్లు కూడా ఆచితూచి పక్కా కార్యాచరణతో ముందుకెళ్తున్నట్టు గుసగుసలు వినిపిస్తున్నాయి.

ధ్యాన్‌చంద్ స్ఫూర్తితో రాణించాలి

ఇన్‌చార్జ్ డీవైఎస్ఓ అనిల్‌కుమార్

వరంగల్ స్పోర్ట్స్: అసమాన ప్రతిభతో అంతర్జాతీయ హాకీ వేదికపై త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసిన మేజర్ ధ్యాన్‌చంద్ స్ఫూర్తితో యువత క్రీడల్లో రాణించాలని హనుమకొండ జిల్లా ఇన్‌చార్జ్ డీవైఎస్ఓ అనిల్‌కుమార్ సూచించారు. ధ్యాన్‌చంద్ జయంతి (జాతీయ క్రీడా దినోత్సవం) సందర్భంగా మంగళవారం హనుమకొండలోని జేఎన్ఎస్‌లో నిర్వహించిన చలో మైదాన్ క్రీడా పోటీలు ఉత్సాహంగా జరిగాయి. ముందుగా ఇండోర్ స్టేడియంలో ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈసందర్భంగా అనిల్‌కుమార్ మాట్లాడుతూ.. చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని, ఆదిశగా పిల్లలను తల్లిదండ్రులు ప్రోత్సహించాలన్నారు. జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో 8 క్రీడాంశాల్లో నిర్వహించిన క్రీడా పోటీల్లో బాలబాలికలు ఉత్సాహంగా పాల్గొన్నారు. సాయంత్రం జేఎన్ స్టేడియంలోని బాస్కెట్‌బాల్ గ్రౌండ్‌లో నిర్వహించిన క్రీడా ముగింపు వేడుకలకు వరంగల్ ఒలింపిక్ సంఘం జిల్లా చైర్మన్ ఎండి అజీజ్‌ఖాన్ హాజరై విజేతలకు పతకాలు అందించారు. కార్యక్రమంలో డీఎస్ఏ కోచ్‌లు శ్రీమన్నారాయణ, ప్రశాంత్, రమేశ్, బొడ్డు విష్ణువర్ధన్, వెంకట్, రాజు, శంకర్, ప్రభుదాస్ పాల్గొన్నారు.

ప్రతిపాదనలు రూపొందించండి

మేయర్ సుధారాణి, కమిషనర్ బాషా



కమాండ్ కంట్రోల్ పనులు పరిశీలిస్తున్న మేయర్, కమిషనర్

వరంగల్ అర్బన్: ప్రభుత్వం ఇటీవల మంజూరు చేసిన తెలంగాణ అర్బన్ ఫైనాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (టీయూఎఫ్ఐడీసీ) రూ.250 కోట్ల నిధుల అభివృద్ధి ప్రతిపాదనలు రూపొందించాలని మేయర్ గుండు సుధారాణి ఇంజనీర్లను ఆదేశించారు. మంగళవారం బల్దియా ప్రధాన కార్యాలయంలో కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషాతో కలిసి ఇంజనీర్లతో పట్టణ ప్రగతి, స్మార్ట్‌సిటీ, సాధారణ నిధుల పనులపై సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా మేయర్ సుధారాణి మాట్లాడుతూ.. పనులు వెంట పడి పూర్తి చేయించాలన్నారు. అనంతరం ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ పనుల పురోగతిని మేయర్, కమిషనర్లు పరిశీలించి సమర్థంగా నిర్వహించేందుకు సూచనలిచ్చారు. దశాబ్ది ఉత్సవాల సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వంచే రూపొందించిన అభివృద్ధి కార్యక్రమాల ఆల్బమ్‌ను కమిషనర్ రిజ్వాన్‌బాషా మేయర్ గుండు సుధారాణికి అందించారు.

తల్వార్ తిప్పితే జైలుకే..

సీపీ ఏవీ రంగనాథ్



వరంగల్ క్రైం: బహిరంగంగా తల్వార్ (కత్తి)ని ప్రదర్శించిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని వరంగల్ పోలీస్ కమిషనర్ ఏవీ రంగనాథ్ హెచ్చరించారు. ఇటీవలి కాలంలో కమిషనరేట్ పరిధిలో తల్వార్లు, కత్తుల సంస్కృతి పెరిగిపోయింది. కొంతమంది తల్వార్లు, కత్తులతో యథేచ్ఛగా తిరుగుతూ ఫొటోలకు ఫోజులిస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తుండడంపై సీపీ ప్రత్యేక దృష్టి సారించారు. ఇకపై ఎవరైనా వేడుకల్లో గానీ.. ఇతర కార్యక్రమాల్లో తల్వార్లను బహిరంగంగా ఎత్తి చూపడం, వాటిని తిప్పుతూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తే జైలుకు పంపిస్తామని సీపీ హెచ్చరించారు. ఫొటోలు, వీడియోలను సోషల్ మీడియాలో పోస్టు చేయడంతోపాటు తల్వార్లు పట్టుకొని ఉన్న ఫొటోలతో ఫ్లెక్సీలను ఏర్పాటు చేయడం లాంటి చర్యలకు పాల్పడితే ఉపేక్షించేది లేదన్నారు.

తల్వార్‌తో బెదిరించిన వ్యక్తి అరెస్ట్

రామన్నపేట : నగరంలోని ఇంతేజార్ గంజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ బార్‌లో తల్వార్‌తో క్యాషియర్‌ను బెదిరించిన వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ మేరకు వరంగల్ ఏసీపీ బోనాల కిషన్ నిందితుడి వివరాలు వెల్లడించారు. ఈనెల 24వ తేదీన అండర్ బ్రిడ్జి సమీపంలోని ఓ బార్‌లో రాత్రి 11 గంటల సమయంలో ముక్కెర మధు అనే వ్యక్తి ఫుల్ బాటిల్ ఇవ్వాలని క్యాషియర్ రంజిత్‌ను తల్వార్‌తో బెదిరించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మధును అరెస్టు చేసినట్లు తెలిపారు. సమావేశంలో ఇంతేజార్‌గంజ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, ఎస్ఐ కొమురెల్లి పాల్గొన్నారు.

భూసేకరణ పనులు వేగవంతం చేయాలి

సమీక్షలో వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య

కరీమాబాద్ : అభివృద్ధి పనుల కోసం భూసేకరణ పనులు వేగవంతం చేయాలని వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని చాంబర్‌లో మంగళవారం ఎన్‌హెచ్ 163, రైల్వే మూడో లైన్, ఇన్నర్ రింగ్‌రోడ్డు, ఎస్సారెస్పీ, మెగా టెక్స్‌టైల్ పార్కుకు సంబంధించి ఆయా శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. నాగ్‌పూర్ నుంచి విజయవాడ కారిడార్ కోసం గీసుకొండ, సంగెం, నెక్కొండ, పర్వతగిరి మీదుగా వెళ్లే ఎన్‌హెచ్‌కు 161.121 హెక్టార్లకు సంబంధించి ఆరు గ్రామాల్లో అవార్డు ప్రక్రియ పూర్తయ్యిందని, మిగిలిన గ్రామాల్లో 15 రోజుల్లో పూర్తి చేయాలన్నారు. కాజీపేట నుంచి విజయవాడ వరకు నిర్మించే రైల్వే మూడో లైన్ కోసం 34.34 హెక్టార్ల భూమికి 29.63 హెక్టార్ల భూ సేకరణ పూర్తయిందన్నారు. అదనపు కలెక్టర్ శ్రీవత్స, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో పరిశీలనలు జరగాలి..

సంక్షేమ పథకాలకు సంబంధించి క్షేత్రస్థాయిలో పరిశీలన చేయాలని కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. ధరణి, జీఓ 58, 59, సోషల్ వెల్ఫేర్ పట్టాలు తదితర అంశాలపై కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తహసీల్దార్లతో సమీక్ష నిర్వహించారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి


శోభ మృతదేహం

బచ్చన్నపేట : రోడ్డు దాటుతున్న ఓ మహిళను బైక్ ఢీకొంది. దీంతో తీవ్ర గాయాలపాలైన ఆమెను ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. బచ్చన్నపేట మండలం బండనాగారానికి చెందిన బరాబరి శ్రీనివాస్, శోభ(40) దంపతులు కొంత కాలంగా బీబీనగర్‌లో నివసిస్తున్నారు. సోమవారం రాత్రి కుటుంబీకులతో కలిసి శుభకార్యానికి హాజరై వస్తున్నారు. రోడ్డు దాటుతున్న క్రమంలో బైక్ ఢీకొనగా శోభ తీవ్రంగా గాయపడింది. దీంతో క్షతగాత్రురాలిని వెంటనే హైదరాబాద్ గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. అనంతరం మృతదేహాన్ని బండనాగారం తరలించి అంత్యక్రియలు నిర్వహించారు.

వివాహిత ఆత్మహత్య

దామెర : భర్త వేధింపులు తాళలేక ఓ వివాహిత (బాలిక) ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన మంగళవారం మండలంలోని కోగిల్వాయిలో జరిగింది. గ్రామానికి చెందిన గాజు నాగరాజు పెద్ద కూతురును రెండు సంవత్సరాల క్రితం ఇదే గ్రామానికి చెందిన పెరుగు రాజు తీసుకెళ్లి వివాహం చేసుకున్నాడు. ఈ క్రమంలో కొద్ది రోజుల నుంచి బాలిక అంటే తనకు ఇష్టం లేదంటూ వేధింపులకు దిగాడు. ఈ విషయమై పెద్ద మనుషుల సమక్షంలో పంచాయితీ నిర్వహించి సర్దిచెప్పి బాలికను రాజు ఇంటికి పంపించారు. ఇదిలా ఉండగా రాజు సోమవారం మరో మహిళతో సన్నిహితంగా ఉండడం బాలిక గమనించింది. దీంతో భర్తతో గొడవపడి సాయంత్రం ఇంటికి వచ్చింది. అనంతరం మనస్తాపం చెందిన బాలిక.. మంగళవారం ఓ బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. బాలిక కోసం బంధువులు వెతకగా బావిలో మృతిచెంది కనిపించింది. మృతురాలి తండ్రి నాగరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పరకాల రూరల్ సీఐ మల్లేశ్ తెలిపారు.

నువ్వా..? నేనా..?

కాంగ్రెస్‌లో మరోసారి బయటపడిన వర్గపోరు

- వర్ధన్నపేటలో నమిండ్ల శ్రీనివాస్, మాజీ ఐపీఎస్ నాగరాజు బలప్రదర్శన
- నియోజకవర్గ స్థాయి సమావేశంలో రచ్చరచ్చ


వేదికపై నేతలతో వాగ్వాదం చేస్తున్న కార్యకర్తలు

వర్ధన్నపేట: కాంగ్రెస్ పార్టీలో వర్గపోరు మరోసారి బయటపడింది. కీలక నేతల సమక్షంలోనే నువ్వా..నేనా అనేలా బలప్రదర్శన జరిగింది. దీంతో నేతల నుంచి.. కార్యకర్తల వరకు నిరుత్సాహానికి గురయ్యారు. మంగళవారం వర్ధన్నపేట మండలం ఇల్లంద గ్రామంలోని లక్ష్మి గార్డెన్స్‌లో పార్టీ నియోజకవర్గ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏఐసీసీ సభ్యుడు, వరంగల్ పార్లమెంట్ ఇన్‌చార్జ్ రవీంద్ర ఉత్తమ్‌రావు దాల్వి, టీపీసీసీ ఉపాధ్యక్షురాలు శోభారాణి, వరంగల్ ఉమ్మడి జిల్లా కీలక నేతలు హాజరయ్యారు. వీరి సమక్షంలోనే పార్టీలో ఆధిపత్య పోరు బయటపడింది. వేదికపై పార్టీ వర్ధన్నపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ నమిండ్ల శ్రీనివాస్ ఆశీనులయ్యారు. ఈ క్రమంలో మాజీ ఐపీఎస్, కాంగ్రెస్ నేత కేఆర్ నాగరాజు.. కార్యకర్తలతో ర్యాలీగా వచ్చి వేదికపైకి వెళ్తున్నాడు. ఈ క్రమంలో నమిండ్ల వర్గం నాగరాజును వేదికపైకి రాకుండా అడ్డుకుంది. దీంతో ఇరువర్గాల నేతలు తమ నాయకత్వాలకు అనుకూలంగా నినాదాలు చేయగా తోపులాట జరిగింది. దీంతో పరిస్థితి సుమారు అరగంట పాటు ఉద్రిక్తంగా మారింది. వేదికపై ఉన్న నేతలు కలుగజేసుకుని ఎమ్మెల్యే టికెట్‌కు దరఖాస్తు చేసుకున్న వారందరూ వేదికపైకి రావాలని కోరడంతో వివాదం సద్దుమణిగింది.

బలప్రదర్శన వేదికగా..

కాంగ్రెస్ వర్ధన్నపేట నియోజకవర్గ సమీక్ష సమావేశానికి నమిండ్ల శ్రీనివాస్, కెఆర్ నాగరాజు ఆధ్వర్యంలో పార్టీ కార్యకర్తలను భారీ సంఖ్యలో రప్పించారు. వేదికపై ఎవరికి వారు తమ బల ప్రదర్శన నిరూపించుకునే ప్రయత్నం చేశారు. కాగా, మంగళవారం నిర్వహించిన సమావేశానికి అధికంగా కార్యకర్తలు అధికంగా తరలిరావడంతో కాంగ్రెస్ నేతలు ఆశ్చర్యానికి గురయ్యారు.

నాయకులే మోసం చేస్తున్నారు..

నాయకుల తప్పిదాలతోనే కాంగ్రెస్ ఓడిపోతుందని, వచ్చే ఎన్నికల్లో కూడా గెలుపోటములకు వారిదే బాధ్యతని కీలక నేతలు హెచ్చరించారు. కాగా, గత ఎన్నికల్లో పొత్తులో భాగంగా వర్ధన్నపేట స్థానాన్ని టీజేఎస్‌కు కేటాయించగా కాంగ్రెస్ నాయకులే మద్దతు ఇవ్వలేదని, బీఆర్ఎస్‌కు సహకరించారని కార్యకర్తలు గుసగుసలాడుకోవడం కనిపించింది.

నిరంకుశ పాలన సాగిస్తున్న బీజేపీ, బీఆర్ఎస్

- ఏఐసీసీ అబ్జర్వర్, వరంగల్ పార్లమెంట్ ఇన్‌చార్జ్ రవీంద్ర ఉత్తమ్‌రావు దళ్వి
- ఘన్‌పూర్‌లో నియోజకవర్గస్థాయి కాంగ్రెస్ సమావేశం


మాట్లాడుతున్న ఏఐసీసీ అబ్జర్వర్ రవీంద్ర ఉత్తమ్‌రావు దళ్వి

స్టేషన్‌ఘన్‌పూర్: దేశంలో బీజేపీ, రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వాలు నిరంకుశ, అవినీతి పాలన సాగిస్తున్నాయని ఏఐసీసీ అబ్జర్వర్, కాంగ్రెస్ పార్టీ వరంగల్ పార్లమెంట్ ఇన్‌చార్జ్ రవీంద్ర ఉత్తమ్‌రావు దళ్వి అన్నారు. స్థానిక ఈఆర్ఎల్ గార్డెన్స్ ఫంక్షన్‌హాల్‌లో మంగళవారం సాయంత్రం కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. పార్టీ జనగామ జిల్లా అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ముఖ్య అతిథిగా రవీంద్ర ఉత్తమ్‌రావు దళ్వి హాజరై మాట్లాడారు. ఘన్‌పూర్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ నుంచి ఎవరికి అవకాశం ఇచ్చినా అందరూ ఐక్యంగా పనిచేయాలని, గ్రూపులను ప్రోత్సహించవద్దని సూచించారు. మన లక్ష్యం బీఆర్ఎస్‌ను ఓడించడమేనన్నారు. కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజలకు ఆశలు పెట్టి మోసం చేయడంలో సీఎం కేసీఆర్ లాంటి ఘనుడు ఎవరూ లేరన్నారు. తెలంగాణ రాష్ట్రంలో బీఆర్ఎస్ పాలనలో అవినీతికి అడ్డు లేకుండా పోయిందన్నారు. మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో, ఉమ్మడి వరంగల్‌లో కాంగ్రెస్ పార్టీ గెలుపొందడం ఖాయమన్నారు. పార్టీ కార్యకర్తలెవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, మీ వెనుక తాము ఉన్నామని భరోసా ఇచ్చారు. టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సింగపురం ఇందిర మాట్లాడుతూ బీఆర్ఎస్ నేత కడియం శ్రీహరి గతంలో నియోజకవర్గానికి ఏమీ చేయలేదన్నారు. మళ్లీ అవకాశం ఇస్తే తన మార్కు అభివృద్ధి చేస్తానని అంటుడడం శోచనీయమన్నారు.న్నారని విమర్శించారు. సమావేశంలో కాంగ్రెస్‌పార్టీ హనుమకొండ, వరంగల్ జిల్లా అధ్యక్షులు నాయిని రాజేందర్‌రెడ్డి, ఎర్రబెల్లి స్వర్ణ, పార్టీ జనగామ జిల్లా మాజీ అధ్యక్షుడు జంగా రాఘవరెడ్డి, పార్టీ జిల్లా ఇన్‌చార్జ్ శోభారాణి, కూచన రవళి, పార్టీ నాయకులు వరద రాజేశ్వరరావు, దొమ్మాటి సాంబయ్య, డాక్టర్ బొల్లెపల్లి కృష్ణ, చేపూరి వినోద్, గంగారపు అమతరావు,డాక్టర్ రాజమౌళి, చేపూరి చిరంజీవి, శిరీష్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డితో పాటు పార్టీ రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, మండల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఇందిర వర్సెస్ సాంబయ్య

- ఏఐసీసీ అబ్జర్వర్ ముందే ఇరువర్గీయుల బాహాబాహీ


స్టేషన్‌ఘన్‌పూర్‌లో తోపులాడుకుంటున్న ఇందిర, సాంబయ్య వర్గీయులు

స్టేషన్‌ఘన్‌పూర్: జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీలో వర్గ విబేధాలు మరోసారి బయపడ్డాయి. టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఘన్‌పూర్ నియోజకరవ్గ ఇన్‌చార్జ్ సింగపురం ఇందిర, టీపీసీసీ ఉపాధ్యక్షుడు దొమ్మాటి సాంబయ్య వర్గీయులు ఏఐసీసీ అబ్జర్వర్ ముందే బాహాబాహీకి దిగారు. ఘన్‌పూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశాన్ని మంగళవారం సాయంత్రం స్థానిక ఈఆర్ఎల్ గార్డెన్స్ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించారు. పార్టీ జనగామ జిల్లా అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి ముఖ్య అతిథిగా ఏఐసీసీ అబ్జర్వర్, కాంగ్రెస్ పార్టీ వరంగల్ పార్లమెంట్ ఇన్‌చార్జ్ రవీంద్ర ఉత్తమ్‌రావ్ దళ్వి హాజరయ్యారు. సమావేశంలో ముందుగా సింగపురం ఇందిర మాట్లాడారు. అనంతరం దొమ్మాటి సాంబయ్య మాట్లాడుతుండగా ఇందిర వర్గీయులు.. ఇందిర నాయకత్వం వర్ధిల్లాలి, జై కాంగ్రెస్, జై ఇందిర అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. దీంతో సాంబయ్య వర్గీయులు సైతం జై సాంబన్న, జై కాంగ్రెస్ అంటూ నినాదాలు చేపట్టారు. ఈ క్రమంలో మాటామాటా పెరిగి అబ్జర్వర్ ఎదుటే ఇరు వర్గీయుల మధ్య తోపులాట జరిగింది. అక్కడే ఉన్న పార్టీ జిల్లా మాజీ అధ్యక్షుడు జంగా రాఘవరెడ్డి ఇతర నేతలు వారికి నచ్చజెప్పడంతో గొడవ సద్దుమణిగింది.

5న కాటారంలో జాబ్‌మేళా

ఏటూరునాగారం: ఐటీడీఏ పరిధిలోని ఉమ్మడి వరంగల్ జిల్లా గిరిజన నిరుద్యోగ యువతకు ప్రైవేట్ రంగంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడానికి సెప్టెంబర్ 5వ తేదీన జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం యూత్ ట్రైనింగ్ సెంటర్‌లో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ఐటీడీఏ పీఓ అంకిత్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, పీజీ, ఐటీఐ, డిప్లొమా, బీ ఫార్మసీ, ఎం ఫార్మసీ, ఎంబీఏ, బీటెక్ చదివిన 18 నుంచి 35 సంవత్సరాల లోపు గిరిజన యువత జాబ్‌మేళాకు హాజరు కావాలన్నారు. సర్టిఫికెట్లను తమ వెంట తీసుకురావాలని కోరారు. మరిన్ని వివరాలకు 9490341911, 8008932159 నంబర్లను సంప్రదించాలన్నారు.

ఇక.. ఈ నంబర్ల నుంచే అందుబాటులోకి..

- ఆబ్కారీ అధికారులకు కొత్త ఫోన్ నంబర్లు
- కేటాయించిన ఎక్సైజ్ శాఖ

కాజీపేట అర్బన్ : ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఎక్సైజ్ శాఖ అధికారులకు ఆ శాఖ మంగళవారం నూతన ఫోన్ నంబర్లను కేటాయించింది. గతంలో బీఎస్ఎన్ఎల్‌లో కొనసాగగా.. ప్రస్తుతం ఎయిర్‌టెల్ కంపెనీ సిమ్‌లు అందజేసింది. డిప్యూటీ కమిషనర్ నుంచి.. సీఐ స్థాయి వరకు సెప్టెంబర్ 1వ తేదీ నుంచి నూతన సెల్‌ఫోన్ నంబర్లతో ఎక్సైజ్ అధికారులు అందుబాటులో ఉండనున్నారు. అదే విధంగా జిల్లాలోని ఎక్సైజ్ సూపరింటెండెంట్లను ఇక నుంచి జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులుగా(డీపీఈవో) మార్చారు.

ఉమ్మడి వరంగల్ జిల్లా ఎక్సైజ్ అధికారుల కొత్త ఫోన్ నంబర్లు ..

డిప్యూటీ కమిషనర్ వరంగల్)		8712658992
అసిస్టెంట్ కమిషనర్(ఎన్‌ఫోర్స్‌మెంట్) వరంగల్		8712658993
ఎక్సైజ్ సూపరింటెండెంట్లు(జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి)		
డీపీఈవో	వరంగల్ రూరల్	8712658994
డీపీఈవో	వరంగల్ అర్బన్	8712658995
డీపీఈవో	జనగామ	8712658996
డీపీఈవో	జయశంకర్ భూపాలపల్లి	8712658997
డీపీఈవో	మహబూబాబాద్	8712658998
అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్లు ..		
ఏఈఎస్(ఎన్‌ఫోర్స్‌మెంట్) వరంగల్		8712658999
ఏఈఎస్	వరంగల్ రూరల్	8712659001
ఏఈఎస్	జనగామ	8712659002
ఏఈఎస్	జయశంకర్ భూపాలపల్లి	8712659003
ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐలు..		
పీ అండ్ ఈఐ(ఎన్‌ఫోర్స్‌మెంట్)	వరంగల్	8712659004
పీ అండ్‌ఈఐ(ఎన్‌ఫోర్స్‌మెంట్)	వరంగల్	8712659005
టాస్క్‌ఫోర్స్ సీఐలు..		
డీటీఎఫ్	వరంగల్ అర్బన్	8712659023
డీటీఎఫ్	వరంగల్ రూరల్	8712659024
డీటీఎఫ్	జయశంకర్ భూపాలపల్లి	8712652025
డీటీఎఫ్	మహబూబాబాద్	8712659026
డీటీఎఫ్	జనగామ	8712659027

ఉమ్మడి వరంగల్ జిల్లా సీఐలు..		
ఎస్‌హెచ్‌వో	ఘన్‌పూర్	8712659006
ఎస్‌హెచ్‌వో	జనగామ	8712659007
ఎస్‌హెచ్‌వో	పాలకుర్తి	8712659008
ఎస్‌హెచ్‌వో	భూపాలపల్లి	8712659009
ఎస్‌హెచ్‌వో	ఏటూరునాగారం	8712659010
ఎస్‌హెచ్‌వో	కాటారం	8712659011
ఎస్‌హెచ్‌వో	ములుగు	8712659012
ఎస్‌హెచ్‌వో	గూడూరు	8712659013
ఎస్‌హెచ్‌వో	మహబూబాబాద్	8712659014
ఎస్‌హెచ్‌వో	తొర్రూరు	8712659015
ఎస్‌హెచ్‌వో	నర్సంపేట	8712659016
ఎస్‌హెచ్‌వో	పరకాల	8712659017
ఎస్‌హెచ్‌వో	వర్ధన్నపేట	8712659018
ఎస్‌హెచ్‌వో	హనుమకొండ	8712659019
ఎస్‌హెచ్‌వో	కాజీపేట	8712659020
ఎస్‌హెచ్‌వో	ఖిలా వరంగల్	8712659021
ఎస్‌హెచ్‌వో	వరంగల్ అర్బన్	8712659022
లిక్కర్ డిపో సీఐలు..		
డిపో సీఐ డిపో-1 వరంగల్ అర్బన్		8712659028
డిపో సీఐ డిపో -2 వరంగల్ అర్బన్		8712659029
స్టాఫ్ ఆఫీసర్(ఎస్‌వో) వరంగల్		8712659030

'చల్లా' మాకొద్దు..'నాగుర్ల'కే మద్దతు

- తెలంగాణ ఉద్యమకారుల స్పష్టీకరణ
- ధర్మారెడ్డి టికెట్ రద్దు చేయాలి
- పరకాలలో సమావేశం


మాట్లాడుడుతున్న రాజేశం

పరకాల: సీఎం కేసీఆర్.. బీఆర్ఎస్ పరకాల అసెంబ్లీ అభ్యర్థిగా చల్లా ధర్మారెడ్డిని ప్రకటించారు. అయితే ఈ నిర్ణయాన్ని నాగుర్ల వెంకటేశ్వర్లు వర్గంతో పాటు తెలంగాణ ఉద్యమకారులు, వివిధ సంఘాల నాయకులు వ్యతిరేకిస్తున్నారు. ఒంటెద్దు పోకడలతో వెళ్తున్న ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి తమ తడఖా చూపిస్తామని హెచ్చరిస్తున్నారు. చల్లా ధర్మారెడ్డి అభ్యర్థిత్వాన్ని మార్చాలంటూ పరకాలలోని స్వర్ణగార్డెన్‌లో మంగళవారం బీఆర్ఎస్ పార్టీ, వివిధ సంఘాల నాయకులు, ఉద్యమకారులు సమావేశం నిర్వహించారు. తెలంగాణ ఉద్యమకారుల సంఘం వరంగల్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు సందెల సునీల్‌కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆరె సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ జెండా రాజేశ్, హనుమకొండ, వరంగల్ జిల్లా అధ్యక్షులు హింగే శివాజీ, ఇంగ్లే శివాజీ, తెలంగాణ ఉద్యమకారుడు (బీఆర్ఎస్ బహిష్కృతనేత) గజ్జి విష్ణువర్ధన్‌తో పాటు తెలంగాణ ఉద్యమకారులు, బీఆర్ఎస్ కార్యకర్తలు, వ్యాపారులు, ఆరెకులస్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా గజ్జి విష్ణు మాట్లాడుతూ 15 సంవత్సరాలు తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న తనను వివిధ కేసులతో వేధిస్తున్నారన్నారు. టికెట్ రాకముందు..టికెట్ వచ్చిన తర్వాత కూడా ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డిలో ఎలాంటి మార్పు రాలేదన్నారు. కేవలం తన ఆస్తులను రూ.200 కోట్లకు, 2వేల ఎకరాలకు పెంచుకున్నారన్నారు. అలాంటి ఎమ్మెల్యేకు మళ్లీ టికెట్ ఇచ్చారని, ఇప్పటికైనా అధిష్టానం తన నిర్ణయం మార్చుకోవాలని, లేని పక్షంలో ప్రజలు బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. బహుజన బిడ్డ నాగుర్ల వెంకటేశ్వర్లుకు టికెట్ ఇస్తేనే పరకాలలో గులాబీ జెండా ఎగురుతుందన్నారు. సందెల సునీల్‌కుమార్ మాట్లాడుతూ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డికి ఏ కులం, వర్గం మద్దతు తెలపడం లేదన్నారు. ఆరెసంక్షేమ సంఘ రాష్ట్ర కన్వీనర్ మాట్లాడుతూ ఉద్యమకారుడు నాగుర్లకు టికెట్ ఇవ్వకపోవడంపై ప్రజలు ఆశ్చర్యపోవాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. సమావేశంలో గుండెకారి రంగారావు, నాగుర్ల శంకర్‌రావు, వంచనగిరి వీరేశం, గుర్రం రఘు, బాబుమీయా, మోతె చిరంజీవి, హెండిగా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మూడు గంటల ప్రభుత్వమా.. | మూడు పంటల ప్రభుత్వమా?

- ఏది కావాలో ప్రజలు నిర్ణయించుకోవాలి
- ఆయిల్‌పామ్ సాగుతో అధిక లాభాలు
- రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి దయాకర్‌రావు


మాట్లాడుతున్న మంత్రి దయాకర్‌రావు

తొర్రూరు రూరల్: వ్యవసాయానికి మూడు గంటల విద్యుత్ చాలున్న కాంగ్రెస్ కావాలా.....మూడు పంటలు పండించేందుకు నిరంతర విద్యుత్ ఇచ్చే బీఆర్ఎస్ కావాలో ప్రజలు నిర్ణయించుకోవాలని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. మంగళవారం మండలంలోని గోపాలగిరిలో రూ.200 కోట్లతో ఏర్పాటు చేయనున్న ఆయిల్‌పామ్ పరిశ్రమకు శంకుస్థాపన చేశారు. అనంతరం జరిగిన సభలో వరంగల్ ఎంపీ పసునూరి దయాకర్, మహబూబాబాద్ ఎమ్మెల్యే శంకర్‌నాయక్, ఆయిల్‌ఫెడ్ రాష్ట్ర చైర్మన్ కంచర్ల రామకృష్ణారెడ్డితో కలిసి మంత్రి మాట్లాడారు. మూడు గంటల విద్యుత్ చాలు అని రైతులను అవమానించిన కాంగ్రెస్‌కు వచ్చే ఎన్నికల్లో కర్రు కాల్చి వాత పెట్టాలన్నారు. అన్ని రకాల పంటలు పండించి నష్టపోయామని..ఇకనైనా ఆయిల్‌పామ్ పంటను సాగు చేసి అధిక లాభాలు సాధించాలని సూచించారు. ఎంపీ దయాకర్ మాట్లాడుతూ ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఏకైక ఆయిల్‌పామ్ పరిశ్రమ తొర్రూరులో ఏర్పాటు చేయడం గర్వకారణమన్నారు. ఎమ్మెల్యే శంకర్‌నాయక్ మాట్లాడుతూ జిల్లా వాసుల సౌకర్యార్థం మంత్రి దయాకర్‌రావు ఆయిల్ ఫామ్ పరిశ్రమ ఇక్కడికి తీసుకురావడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. ఆయిల్‌ఫెడ్ రాష్ట్ర చైర్మన్ కంచర్ల రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ ఈ ఏడాది రెండు లక్షల ఎకరాల్లో ఆయిల్‌పామ్ పంటను సాగు చేస్తున్నట్లు తెలిపారు. కలెక్టర్ శశాంక మాట్లాడుతూ జిల్లాలో 7 వేల ఎకరాల్లో ఆయిల్‌పామ్ పంటను సాగు చేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఆయిల్‌ఫెడ్ ఎండీ సురేందర్‌రెడ్డి, జీఎం సుధాకర్‌రెడ్డి, రైతుబంధు సమితి జిల్లా కోఆర్డినేటర్ బాలాజీనాయక్, జిల్లా ఉద్యానశాఖ అధికారి సూర్యనారాయణ, ఎంపీపీలు తూర్పాటి చిన్న అంజయ్య, ఈదురు రాజేశ్వరి, జెడ్పీటీసీలు మంగళపల్లి శ్రీనివాస్, మేకపోతుల శ్రీనివాస్‌రెడ్డి, ఆర్‌బీఎస్ మండల కోఆర్డినేటర్ దేవేందర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కాకిరాల హరిప్రసాద్, ఆయిల్‌ఫెడ్ మేనేజర్ శ్రీకాంత్‌రెడ్డి, జిల్లా ఇన్‌చార్జ్ రాములు పాల్గొన్నారు.

గోపాలగిరిలో రైతుల నిరసన

ఆయిల్‌పామ్ పరిశ్రమ ఏర్పాటుతో తమ భూములు కోల్పోతున్నామని పేర్కొంటూ ఆ గ్రామ రైతులు అధికారులు, ప్రజా ప్రతినిధుల వాహనాలను అడ్డుకుని నిరసన తెలిపారు. తమకు న్యాయం చేయకుండా ఎలా శంకుస్థాపన చేస్తారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో పోలీసులు 16మందిని అదుపులోకి తీసుకున్నారు. కాగా, భూములు కోల్పోయిన రైతులకు పట్టాలు లేవని, అయినప్పటికీ మానవతా దృక్పథంతో ప్రభుత్వం వారికి డబుల్ బెడ్రూం ఇళ్లు, స్థలాలు, ఉపాధి అవకాశాలు కల్పిస్తుందని మంత్రి దయాకర్‌రావు స్పష్టం చేశారు.

రక్తపు మరకల కలకలం..

- భయాందోళనలో రజాలీపేట గ్రామస్తులు
- పోలీసులకు ఫిర్యాదు..


రక్తపు మరకలను పరిశీలిస్తున్న పోలీసులు

మహబూబాబాద్ రూరల్ : మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని రజాలీపేట గ్రామంలో రక్తపు మరకలు మంగళవారం కలకలం సృష్టించాయి. గ్రామానికి చెందిన పోతరాజు వీరభద్రం, పోతరాజు రామతార, నల్లపు ఉపేందర్, నీలం రమాదేవి, దొంగరి వీరయ్య ఇళ్ల ఆవరణాల్లో మూడు రోజుల నుంచి రక్తపు మరకలు కనిపిస్తుండడంతో గ్రామస్తులు భయాందోళనకు గురయ్యారు. ఆదివారం అర్ధరాత్రి నుంచి దుండగులు గ్రామంలోని పలువురి ఇళ్ల ఎదుట, డాబాలు, గడపలపై రక్తం చల్లుతూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. ఉదయం లేచి తలుపులు తీసి చూసే సరికి ఇండ్ల ఎదుట రక్తం ఉండడంతో భయాందోళనకు గురవుతున్నామని, తమను కూడా చంపుతారనే భయంతో పోలీసులకు ఫిర్యాదు చేశామని తెలిపారు. సమాచారం తెలుసుకున్న కురవి పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని విచారణ చేపట్టారు. సమగ్ర విచారణ జరిపి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు పోలీసులను కోరారు. కాగా, ఎవరైనా క్షుద్ర పూజలు చేస్తూ రక్తాన్ని ఇళ్ల ఎదుట, ఇళ్ల పైకప్పుల మీద చల్లుతున్నారో తెలియడం లేదని గ్రామస్తులు పేర్కొన్నారు.

కత్తితో నరికి..చెరువులో పడేసి..

- శివునిపల్లిలో వ్యక్తి దారుణ హత్య
- ఆలస్యంగా వెలుగులోకి..


కరుణాకర్ (ఫైల్)

స్టేషన్‌ఘన్‌పూర్ : మండలంలోని శివునిపల్లికి చెందిన తీగల కరుణాకర్(35) దారుణహత్యకు గురయ్యాడు. అదే గ్రామానికి చెందిన చిక్కుడు నాగరాజు.. కరుణాకర్‌ను కత్తితో దారుణంగా చంపి శివునిపల్లి శివారు నమిలిగొండ చెరువులో పడేశాడు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్టేషన్‌ఘన్‌పూర్ ఏసీపీ శ్రీనివాసరావు కథనం ప్రకారం శివునిపల్లి ఎస్సీ కాలనీకి చెందిన తీగల యోబు, మరియ దంపతుల రెండో కుమారుడు కరుణాకర్ హైదరాబాద్‌లో ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. అదేవిధంగా శివునిపల్లికి చెందిన చిక్కుడు నాగరాజు హమాలీ పనిచేస్తుంటాడు. నమిలిగొండ శివారులో వారివురి వ్యవసాయ భూములు పక్కపక్కనే ఉన్నాయి. ఈ క్రమంలో కరుణాకర్‌కు, నాగరాజు భార్యకు మధ్య పరిచయం ఏర్పడింది. ఈనెల 25న హైదరాబాద్‌లో ఉన్న కరుణాకర్.. నాగరాజు భార్య ఫోన్‌కు ఫోన్ చేయగా ఇంట్లో ఉన్న ఆయన ఫోన్ లిఫ్ట్ చేశాడు. ఇదీ గమనించని కరుణాకర్ తాను సాయంత్రం వస్తున్నానని, కలుస్తామని చెప్పగా నాగరాజు కోపంతో రగిలిపోయాడు. ఈ విషయంపై ఏమి తెలియనట్లు బయటకు వెళ్లాడు. అనంతరం సాయంత్రం ఆమెకు మరోసారి ఫోన్ రావడంతో తమ వ్యవసాయ భూముల సమీపంలో ఉన్న మామిడితోట వద్దకు వెళ్లింది. గమనించిన నాగరాజు కత్తి తీసుకుని మామిడితోటకు వెళ్లాడు. అక్కడ తన భార్యతో కరుణాకర్ మాట్లాడుతున్న విషయం గుర్తించి ఒక్కసారిగా కత్తితో దాడి చేసి హతమార్చాడు. అనంతరం మృతదేహాన్ని కచ్చువల, సంచిలో కట్టి నమిలిగొండ చెరువులో పడేసి వెళ్లాడు. ఈనెల 25వ తేదీ రాత్రి నుంచి కరుణాకర్ కనిపించకపోవడంతో కుటుంబీకులు చుట్టుపక్కల గ్రామాలు, బంధువుల ఇళ్లలో వెతికారు. అతడి ఆచూకీ కోసం పోలీసులను కూడా ఆశ్రయించారు. ఈ క్రమంలో నిందితుడు స్వయంగా మంగళవారం పోలీసులకు లొంగిపోయినట్లు సమాచారం. దీంతో విషయం తెలుసుకున్న స్టేషన్‌ఘన్‌పూర్, రఘునాథపల్లి సీఐలు రాఘవేందర్, శ్రీనివాస్‌రెడ్డి.. చెరువు వద్దకు చేరుకుని మృతదేహాన్ని బయటకి తీయించారు. దీంతో మృతుడి భార్య, సోదరులు, కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. విషయం తెలుసుకున్న ఏసీపీ శ్రీనివాసరావు ఘటనా స్థలికి చేరుకుని పరిశీలించారు. దీనిపై మృతుడి భార్య కవిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రాఘవేందర్ తెలిపారు. కాగా, హత్య ఒక్కరే చేశారా.. మరెవరైనా ఉన్నారా? హత్యకు వివాహేతర సంబంధమే కారణమా? లేదా ఇతర కారణాలు ఉన్నాయా అనే పోలీసులు కోణాల్లో విచారణ చేస్తున్నారు.